క్లుప్తంగా

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



రుద్రూర్: పోతంగల్‌లోని బాలాజీ ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకలు రెండు రోజుల పాటు వైభవంగా కొనసాగాయి. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమవారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం విద్యారణ్య భారతి స్వామికి భక్తులు పాదపూజ, తులాభారం చేపట్టారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆలయ సమీపంలో ఉన్న రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, హనుమాన్, ఏకశిల స్తంభాలను భక్తులు సందర్శించారు. నందీశ్వర మహరాజ్ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో బి సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, హజారి సతీశ్, కొంతం మంజుల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు వినతి

వర్ని: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు ఎంఈవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి వర్ని మండలంలో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సంజయ్, మహేశ్, విష్ణు, తేజ పాల్గొన్నారు.

పెరిగిన కార్మికుల వేతనాలు మే నుంచి అమలు

వర్ని: బీడీ కార్మికులకు పెరిగిన వేతనాలు మే 1 నుంచి అమలవుతాయని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ అన్నారు. చందూరు మండల కేంద్రంలో బీడీ కార్మికులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీడీలు చేసే కార్మికులు, నెలసరి ఉద్యోగులు, బీడీ ప్యాకర్లకు వేతనాలు పెరిగాయని అన్నారు. నూతన ఒప్పందంతో రాష్ట్రవ్యాప్తంగా బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న 7 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వర్ని: మండల కేంద్రంలో మాదాల చారిటబుల్ ట్రస్టు సభ్యులు నిరుపేదలకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. ట్రస్టు మేనేజర్ కామేపల్లి ఠాగూర్, సభ్యులు సుబ్బారావు, నర్సయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 32వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ బాలస్వర్ణ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు సంతోష్, మమత అంగన్‌వాడిలోని చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కములు శోభా, ఫార్మాసిస్టు శ్రావణ్‌గౌడ్, ఏఎన్‌ఎం వినోద్ పాల్గొన్నారు.

కార్మికులకు ఏరియర్స్ చెల్లించాలి



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్మికులకు పెరిగిన 8 నెలల జీతాలను ఏరియర్స్ ద్వారా చెల్లించాలని కోరుతూ కార్మికులు కమిషనర్ రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆర్మూర్ అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన జీతాలను నవంబర్ 2022 నుంచి కాకుండా జూన్ 2023 నుంచి అందిస్తోందని, దీంతో కార్మికులు నష్టపోవాల్సి వస్తోందని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు, సబ్బులు, ఇతర సామగ్రి అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ ఏర్పాటు హర్షణీయం

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యా, వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేస్తే ఎంతో మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌టీ కుమార్, మెతరి సాయన్న, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. సాగని పనులు

- ఆలయ నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం
- పనులు వేగవంతం చేయాలంటున్న గ్రామస్తులు



రేకుల షెడ్డులో హనుమంతుని విగ్రహం



సోన్‌పేట్‌లో బేస్మెంట్ వరకు నిలిచిన ఆలయ నిర్మాణ పనులు

బాల్కొండ: ఆలయ నిర్మాణానికి నిధులు ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. మెండోరా మండలంలోని సోన్‌పేట్‌లో ఉన్న హనుమాన్ ఆలయానికి ఆరు నెలల క్రితం రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ వాటి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం నెలకొనడంతో గ్రామస్తులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని హనుమాన్ మందిరం శిఖరం పునరుద్ధరణకు ముందుగా గత ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కానీ శిఖరం పునరుద్ధరించినా ఆలయం శిథిలావస్థలో ఉండటంతో ప్రయోజనం ఉండదని నూతనంగా నిర్మాణం చేపట్టాలని స్థానికులు నాటి పాలకులకు విన్నవించారు. దీంతో మందిర నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ. 20 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రొసీడింగ్‌లు అందజేశారు. దీంతో స్థానికులు నాడు నూతన మందిరం కోసం పాత మందిరాన్ని కూల్చివేశారు. ఆ ప్రాంతంలో రేకులషెడ్డు వేసి పూజలు చేపడుతున్నారు. నిధులు మంజూరైనా అధికారులు ఇంకా టెండర్లు పూర్తి చేయలేదనే వాదన వినిపిస్తోంది. పనులు ముందుకు కదలకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ టెండర్ కాకుంటే ఆలయ నిర్మాణ బేస్మెంట్ పనులను ఎందుకు ప్రారంభించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై దేవాదాయ శాఖ అధికారులు సరైన సమాధానాలు ఇవ్వడం లేదు. దీంతో ఆరు నెలలుగా పనులు ముందుకు సాగడం లేదు. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో కూడా అధికారులకు తెలియని పరిస్థితి నెలకొంది.

గుడి లేని హనుమంతుడు..

గ్రామంలో ఉన్న హనుమాన్ మందిరాన్ని కూల్చివేసి పక్కన రేకుల షెడ్డులో హనుమాన్ విగ్రహానికి గ్రామస్తులు పూజలు చేస్తున్నారు. సోన్‌పేట్‌లో పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో గుడి లేని హనుమంతుడు అయ్యాడు. అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే గత ప్రభుత్వంలోని పాలకులు ఇష్టారీతిన ప్రొసీడింగ్ ఇచ్చారంటు పలువురు ఆరోపిస్తున్నారు. వారి నిర్లక్ష్యంతో గ్రామంలో హనుమంతుడు గుడిలేని దేవుడయ్యాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ అధికారులను 'సాక్షి' ఫోనులో పలుమార్లు సంప్రదించినా స్పందించలేదు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



డొంకేశ్వర్‌లో అడ్మిషన్లు ఇస్తున్న జెడ్పీ చైర్మన్



మాక్లూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

డొంకేశ్వర్: సర్కారు బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి హాజరయ్యారు. ఇప్పటి వరకు వచ్చిన అడ్మిషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 19వరకు బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులు మరింత మంది ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్కూల్ ప్రారంభం నాటికి అన్ని వసతులు సిద్ధం చేసి ఉంచాలన్నారు. పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటానని జెడ్పీ చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, హెచ్‌ఎంలు సురేశ్ కుమార్, సాబేర బేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, మాజీ సర్పంచ్ చాయచందు, అమ్మ ఆదర్శ కమిటీ, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాక్లూర్‌లో

మాక్లూర్: మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, మూడు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు రజిత, భారతి, నసిమా, అంజలి, గ్రామస్తులుపాల్గొన్నారు.

వేల్పూర్‌లో..

వేల్పూర్: మండల కేంద్రంలో స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వివరించి, విద్యార్థుల తల్లితండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, గంగాధర్, రవి, దేవానందం, శ్రీనివాస్, మురళీకృష్ణ, కైలాస్‌పతి, మాజీ ఎంపీటీసీ మొండి అశోక్ పాల్గొన్నారు.

దూపల్లిలో..

రెంజల్: బడిబాటలో భాగంగా ఐదవ రోజైన సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈవో గణేశ్‌రావు దూపల్లిలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల నమోదులో పాల్గొన్నారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయారెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు సాయన్న, ప్రభాకర్, లక్ష్మీదేవమ్మ, శ్రీధర్ పాల్గొన్నారు.



దూపల్లిలో ఉపాధ్యాయులు



వేల్పూర్‌లో..

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ



మోర్తాడ్‌లో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో



బాల్కొండలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంఈవో

మోర్తాడ్/ కమ్మర్‌పల్లి/ బాల్కొండ/ రెంజల్/ బోధన్: మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులను ఎంఈవో ఆంధ్రయ్య సోమవారం పంపిణీ చేశారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు 16,839 పాఠ్య పుస్తకాలు, 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 13వేల నోట్‌బుక్కులను అందించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజునే వీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు సాయిరాం, సురేశ్, మహేందర్, పరిమళ, ఐఈఆర్‌పీలు మధు శేఖర్, ప్రేమలత, మెస్సెంజర్ పండరి తదితరులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి మండలంలో ఐదో నుంచి పదోతరగతి విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన ఉచిత నోట్‌బుక్‌లను ఎంఈవో ఆంధ్రయ్య ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు బి అంజయ్య, పి అంజయ్య, రాజేశ్, లలిత, ఐఈఆర్పీ రాజన్న తదితరులు పాల్గొన్నారు. బాల్కొండలో ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలు, దుస్తులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈవో రాజేశ్వర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన డ్రెస్‌లు, పాఠ్య పుస్తకాలను రెంజల్ హైస్కూల్‌లో ఎంపీపీ లోలపు రజని ఆయా గ్రామాల హెచ్‌ఎంలకు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావు, నోడల్ అధికారి ఆంజనేయులు, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయారెడ్డి, రెంజల్ మాజీ ఎంపీటీసీ కిశోర్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు. సాలూర మండల కేంద్రంలోని దళిత వాడ, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌ను మండల మహిళా సమాఖ్య అధికారులు, ఉద్యోగులు పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రెంజల్‌లో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



సాలూరలో..

వంతెన వెడల్పునకు రూ.8 లక్షలు మంజూరు

- వాహన రాకపోకలకు తప్పనున్న ఇబ్బందులు



డొంకేశ్వర్: మండలంలోని నూత్‌పల్లి–జీజీ నడ్కుడ రోడ్డులో దర్గా వద్ద ప్రమాదకరంగా మారిన ఇరుకు వంతెన త్వరలో వెడల్పుగా మారనుంది. పైప్‌లైన్ కల్వర్టు నూతనంగా నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.8లక్షలు మంజూరు చేసింది. రోడ్లు, భవనాల శాఖ అధికారులు దీని నిర్మాణ పనుల బాధ్యతలను చూస్తున్నారు. త్వరలోనే పైప్‌లైన్ వేసి 15 మీటర్ల వెడల్పుతో కల్వర్టును నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రవీణ్ వెల్లడించారు. కల్వర్టు నిర్మాణం జరిగితే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రమాదాలు కూడా తగ్గనున్నాయి.

ఖరీఫ్ సాగుపై అవగాహన



బాల్కొండ: నేలల్లో తేమ వచ్చిన తర్వాతే పంటలను విత్తుకోవాలని ఏఈవో రేష్మ అన్నారు. మండలంలోని నాగాపూర్‌లో రైతులకు ఖరీఫ్ సాగుపై రైతులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. రైతులు వ్యాపారులతో ఒప్పందం చేసుకుని పంటలను సాగు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. భవిష్యత్తులో విత్తన కొరతకు నాంది తీస్తుందన్నారు. తొలకరి వర్షాలతో తొందర పడి రైతులు విత్తనాలను విత్తుకోవద్దన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా స్కూల్ యూనిఫామ్స్



శివతాండలో యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న డీఆర్డీవో సాయాగౌడ్

నవీపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయాల్సిన యూనిఫామ్స్ సిద్ధంగా ఉన్నాయని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. నవీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని నాగేపూర్, శివతండా పాఠశాలల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్న దుస్తులను సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన దుస్తులను ఈ ఏడాది డ్వాక్రా గ్రూప్ సంఘాల నుంచి సేకరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూప్ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. లక్ష్యానికి అనుగుణంగా నిర్ణీత గడువులో డ్వాక్రా మహిళలు దుస్తులను సిద్ధంగా ఉంచారని అభినందించారు. ఆయన వెంట మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, సీసీలు సువర్ణ, ప్రవీణ, శ్రీనివాస్, రాజమణి, అమ్మ ఆదర్శ కమిటీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

సమాజ స్థితిగతుల మార్పులో విద్యార్థులదే కీలక పాత్ర



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆర్మూర్: సమాజ స్థితి గతుల మార్పులో విద్యార్థులదే కీలక పాత్ర అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు వి ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్ మండలంలోని మైత్రి గార్డెన్స్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి రాజకీయ విజ్ఞాన తరగతుల ప్రారంభ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకుడు పెద్దింటి రామకృష్ణ చేతుల మీదుగా పీడీఎస్‌యూ జెండాను ఆవిష్కరించిన అనంతరం అమర వీరుల సంతాప తీర్మానాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ ప్రవేశపెట్టగా నివాళి అర్పించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ.. సమాజంలో దోపిడీ, పీడన లేని సమాజం కోసం విద్యార్థులు అగ్రభాగాన నిలబడి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పును ఇచ్చారన్నారు. మోదీ అహంకారం, మత ఉన్మాదాన్ని ఓడించారన్నారు. అనంతరం పీడీఎస్‌యూ నాయకుడు అనిల్ ఆధ్వర్యంలో చారిత్రిక భౌతిక వాదం తరగతులను సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆవుల అశోక్ బోధించారు. కార్యక్రమంలో ఎస్.నాగేశ్వరరావు, నరేందర్, అనిల్, పృథ్వి, అఖిల్, సాయి, సురేశ్, గణేశ్, అనిల్, అషూర్, వెంకటేశ్, దీపిక, కావ్య, సీతారాం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన రచన, శ్రీకాంత్, కార్తికేయ, ఉపాధ్యాయులను హైదరాబాద్‌లో వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగారాం, ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్, దేవసేనా, ఎమ్మెల్సీ రఘోతం రెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లిలో..

ముప్కాల్ మండలం వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో గత విద్యాసంవత్సరం నాలుగో తరగతి చదివి గురుకులాల్లో సీట్లు సాధించిన 27 మంది విద్యార్థులను ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. విద్యార్థులకు మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పిప్పెర గణేశ్, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఏఎస్ స్కీం బకాయిలు చెల్లించాలి

పెర్కిట్: ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా చదువుతున్న స్కూల్స్‌కు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని విద్యార్థుల తల్లితండ్రులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి సెయింట్ పాల్స్ స్కూల్‌లో బీఏఎస్ పథకం ద్వారా గత ఆరేళ్ల నుంచి 180 విద్యార్థులు చదువుతున్నారు. కాగా ప్రభుత్వం 2022 సంవత్సరం నుంచి పాఠశాలకు బకాయిలను చెల్లించడం లేదు. దీంతో యాజమాన్యం ఈ విద్యా సంవత్సరం నుంచి స్కీం వర్తించడం లేదని విద్యార్థుల తల్లితండ్రులకు సమాచారం అందజేశారు. దీంతో ఆందోళన చెందిన తల్లితండ్రులు కలెక్టర్‌ను కలిసి బీఏఎస్ స్కీం ద్వారా లబ్ధి పొందుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి బకాయిలు వచ్చేలా చూడాలని కోరారు.

కార్మికులకు వేతనాలు అందించాలి

ఎడపల్లి: జీపీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత 8 నెలల నుంచి అందడం లేదని ప్రభుత్వం వెంటనే వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పేర్కొన్నారు. సోమవారం ఎడపల్లిలో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో పాటు జానకంపేట, అంబం (వై) జీపీల్లో కార్మికులు చేపట్టిన నిరసన, ధర్నా కార్యక్రమానికి ఆమె హాజరై మద్దతు తెలిపారు. కార్మికులు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీపీ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. జొక్కరి పద్మ, స్వామి, బూడిది గంగామణి, బాలమణి, అనిత, లక్ష్మణ్, పెద్ద గంగాధర్, ఎల్లయ్య, బూడిది రాజు, అఫ్రోజ్ ఖాన్, నాగరాజు, సాయిలు, గంగారాం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

మాక్లూర్: ఉపాధి హామీ కూలీలు వంద రోజుల పనిదినాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు సోమవారం అన్నారు. మండలంలోని ఒడ్యాట్‌పల్లిలో ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. పనులకు అందరూ కలిసి రావాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మదన్‌పల్లి, ముత్యంపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. ఎంపీడీవో క్రాంతి, ఏఈ,పీఆర్ శ్రీనివాస్, కార్పొరేటర్ రాజాసింగ్, ఎంపీటీసీ ఒడెన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – లవ్‌బాయ్స్ (తెలుగు) – 11.05, వెపన్ (తెలుగు) – 1.50, భజే వాయువేగం – 4.30, లవ్‌మౌళి (తెలుగు) – 7.25, రక్షణ – 10.30

స్క్రీన్-3 – మనమే (తెలుగు) – 11.45, 3.00, 6.15, 9.30

స్క్రీన్-4 – సత్యభామ – 10.50, 4.50, 10.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి – 1.45, బ్యాడ్‌బాయ్స్ – 7.45

కాలువ కబ్జాపై ఫిర్యాదు



రెంజల్: నిజాంసాగర్ కాలువను నిజామాబాద్‌కు చెందిన వ్యక్తి కబ్జా చేసినట్లు పేపర్ మిల్ గ్రామస్తులు తహశీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న పేపర్‌మిల్ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి కాలువను కబ్జా చేసి గోడ నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో చివరి ఆయకట్టుకు సాగు నీరందక రైతులు పంటల సాగుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని నీలా, పేపర్‌మిల్ గ్రామాల రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తం

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నందిపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏఐకేఎమ్మెస్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో 200 యూనిట్ల లోపు కరెంట్ బిల్లులను అందరికీ మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవన్న, గంగాధర్, గణేశ్, ముత్యం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

వేల్పూర్: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాదులోని రవీంద్ర భారతి సీఎం రేవంత్ రెడ్డి 10 జీపీఏ సాధించిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి రామకృష్ణను సన్మానించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థి, శ్రీ వైద్య గణేశ్ హెచ్‌ఎంలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎడ్యుకేషన్ బుర్ర వెంకటేశం, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్, డైరెక్టర్ దేవసేన, ఎమ్మెల్సీ కూర రఘోతం రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్, రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, బృంద సభ్యులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

రెంజల్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులను అధికారులు సోమవారం పరిశీలించారు. మండలంలోని వీరన్నగుట్ట, నీలా, సాటాపూర్ గ్రామాల్లో జరుగుతున్న పనులను ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌రావు, ఏఈ వినయ్ పరిశీలించారు. పనులను పూర్తి చేయించాలని నిర్వాహకులకు సూచించారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ శక్కర్‌నగర్‌కు ఆరు అవార్డులు



బోధన్‌టౌన్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320డీలో భాగంగా 2023–24లో చేపట్టిన కార్యక్రమాలకు లయన్స్ క్లబ్‌ఆఫ్ శక్కర్‌నగర్‌కు 6 అవార్డులు దక్కాయి. జిల్లా కేంద్రంలోని అమృతగార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ వి లక్ష్మి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం ఆనందంగా శక్కర్‌నగర్ ప్రతినిధులు విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.